క్లుప్తంగా

ధాన్యం కొనుగోలులో పక్షపాతం



సమావేశమైన రైతులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం దంత సచివాలయం పరిధిలో ధాన్యం కొనుగోలు విషయంలో పక్షపాతం చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు వెలమల హరిబాబుతో పాటు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రైతులంతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయం పరిధిలో ధాన్యం కొనుగోలు విషయంలో లక్ష్యాలను చూపుతున్నప్పటికీ కేవలం టీడీపీకి చెందిన కార్యకర్తల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసే విధంగా పక్షపాతం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సచివాలయం పరిధి గ్రామాల్లో మూలుగుతున్న ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు లచ్చమయ్య, శ్రీను, జగ్గారావు, నీలకంఠం తదితర రైతులు డిమాండ్ చేశారు.

చినగురుదాసుపురంలో జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు

పలాస: పలాస మండలం చినగురుదాసుపురంలో ఉగాది సందర్భంగా ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున జినగ ధర్మారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు, తృతీయ బహుమతిగా రూ. 10 వేలు ఇవ్వనున్నామన్నారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. గ్రామస్తుల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 70639 42370, 90735 27344, 99082 26194 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి: ప్రభుత్వం రూపకల్పన చేసిన శక్తి యాప్‌పై సోమవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాలకు చెందిన మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది వి.బాలకృష్ణ నేతృత్వంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది బి.ప్రసాద్, ఆర్.జ్యోతి, ఎస్.రాజేశ్వరి, ఆర్.కుసుమ పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 11 వినతులు

కాశీబుగ్గ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 11 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. మంచినీరు, వివిధ సర్టిఫికెట్లు, పింఛన్ల కోసం వినతులు అందించినట్టు పేర్కొన్నారు.

ఘనంగా రాజగోపుర ప్రతిష్టామహోత్సవం



ప్రత్యేక పూజల్లో భక్తులు

సోంపేట: సోంపేటలోని లక్ష్మీసమేత సత్యనారాయణ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం, ధ్వజస్తంభ, రాజగోపుర, యాగశాల ప్రతిష్టామహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో పలు పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మూడు రోజులు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

సోంపేట: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని పలువురు వక్తలు అన్నారు. ఎర్రముక్కాం గ్రామంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మసిలా అధికారులను దుశ్శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనంత, మర్లపోలమ్మ ఫార్మర్స్ అసోసియేషన్ సీఈవో ప్రియాంకలను సత్కరించగా.. మహిళా సంఘాల ప్రతినిధులు పోట్టి వేదవతి, మద్దు ఈశ్వరమ్మ, పొట్టి శ్యామల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా

టెక్కలి రూరల్: మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్టు టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలిసి సోమవారం టెక్కలి పరిధిలోని పలు ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. టెక్కలి పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు బస్సుల్లో సైతం తనిఖీలు చేశారు. రైల్వేట్రాక్, పాత ఆస్పత్రి పరిసరాలు, పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు.

హుద్‌హుద్ ఇళ్లు.. కేటాయింపు నిల్!

- పంపిణీ కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- నిర్మించి ఏళ్లు గడవడంతో శిథిలమవుతున్న గృహాలు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నెమలికొండ వద్ద నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లు



మందుబాబులు పగలుగొట్టిన ఓ ఇంటి కిటికీలు

కాశీబుగ్గ: హుద్‌హుద్.. ఈ పేరును ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేదు. 2014 అక్టోబర్ 12వ తేదీన ఉత్తరాంధ్రపై విరుచుకుపడిన హుద్‌హుద్ తుఫాన్ ప్రభావం జిల్లాలోని అనేక కుటుంబాలపై పడింది. పెనుగాలుల బీభత్సానికి వందలాది ఇళ్లు నేలమట్టం కావడంతో నిరాశ్రయులయ్యారు. ఇలాంటి వారి కోసం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అప్పటి టీడీపీ సర్కార్ నిర్ణయించింది. లబ్ధిదారులను కూడా ఎంపిక చేసింది. అయితే నిర్మాణాలు పూర్తయి తొమ్మిదేళ్ల గడిచినప్పటికీ వారికి ఇళ్లను కేటాయించలేదు. ఫలితంగా ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో..

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రూ.9.20 కోట్ల అంచనాతో 192 ఇళ్ల నిర్మాణాలకు అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శివాజీలు 2016 ఆగస్టు 27న నెమలికొండ సమీపంలో శంకుస్థాపన చేశారు. 16 ఇళ్లను ఒక బ్లాకుగా.. మొత్తం 12 బ్లాకులతో ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా చూడాలని నాయకులు గుత్తేదారును ఆదేశించారు. కాని ఇళ్ల నిర్మాణం పూర్తిచేసినప్పటికీ మౌలిక సదుపాయాలు శతశాతం కల్పించకపోవడంతో పంపిణీకి అడ్డంకిగా మారింది. రోడ్లు, కాలువలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడం, మంచినీటి సదుపాయం కల్పించకపోవడం సమస్యగా మారింది.

వజ్రపుకొత్తూరు మండలంలో..

వజ్రపుకొత్తూరు మండలం బెండికొండపై తొమ్మిది కోట్ల రూపాయలతో ఒక్కో బ్లాక్‌లో 18 ఇళ్లు చొప్పున 12 బ్లాక్లో మొత్తం 180 ఇళ్ల నిర్మాణానికి కూడా అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక్కడ కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా లబ్ధిదారులకు మాత్రం అప్పగించలేదు. ఫలితంగా విలువైన భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. చీకటిపడితే అసాంఘిక కార్యకలాపాలకు చాలామంది అడ్డాగా ఉపయోగించుకుంటున్నారు. చాలా ఇళ్ల కిటికీలను పాడు చేశారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి హుద్‌హుద్ బాధితులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని బాధితుల కోసం నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. గృహ నిర్మాణశాఖ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం అదనంగా నిధులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

ధాన్యం కొనాలంటే రైతులు కమీషన్లు ఇవ్వాలా?

- సొంత శాఖను పట్టించుకోని మంత్రి అచ్చెన్నాయుడు
- ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తన సొంత నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు విషయంలో దళారీలు ఇచ్చిన కమీషన్లకు కక్కుర్తిపడి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆరోపించారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమ్మాడ, కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయాలను కమీషన్లు దండుకునే అడ్డాలుగా చేసుకున్న మంత్రి అచ్చెన్నాయుడుకు రైతులు కమీషన్లు ఇస్తే తప్ప ధాన్యం కొనుగోలు చేయరా అని ప్రశ్నించారు. సన్న రకాలు పండిస్తే అధిక ధరలు వస్తాయని నమ్మబలికి ఈ రోజు సాధారణ రకంతో పాటు సన్నరకాలు సైతం కొనుగోలు చేయడంలో వ్యవసాయ శాఖా మంత్రిగా అచ్చెన్నాయుడు విఫలమయ్యారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో బ్రోకర్లను పెట్టుకుని దందాలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. రబీ సీజన్‌లో రైతులకు సాగునీరు ఇస్తామని చెప్పి చుక్క నీరు అందజేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రైతుల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. అచ్చెన్నాయుడు తన క్యాంపు కార్యాలయాల్లో కూర్చుని కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను హింసించడమే పనిగా పెట్టుకున్నారని.. దీనికి పోలీసులు సైతం భజన చేస్తూ చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు, యువత గంజాయికు బానిసలుగా మారుతున్నారని తిలక్ ఆరోపించారు. విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మరో వైపు మంత్రి పేరు చెప్పుకుని మద్యం మాఫియా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. అచ్చెన్నాయుడు ఫొటోలను పెట్టుకుని బెల్టు దుకాణాలు కొనసాగిస్తున్నారని దీనికి అధికారులు సైతం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్రానికి, రాష్ట్రానికి మంత్రులుగా ఉన్న టెక్కలి నియోజకవర్గానికి చెందిన రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు పక్క నియోజకవర్గానికి వెళ్లి చెత్త ఊడ్చడానికే తప్పా నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. నియోజకవర్గంలో రౌడీ షీటర్లు రాజ్యమేలుతున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎ.రాహుల్, నాయకులు యు.తమ్మయ్య, ఆర్.జయమోహన్, ఎం.గణపతిరావు ఉన్నారు.

కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా సందీప్



బాడ సందీప్

మందస: మండలంలోని పీతాతోళి గ్రామానికి చెందిన బాడ సందీప్ ఎస్‌ఎస్‌సీ సీజీఎల్‌లో ఆలిండియాస్థాయిలో 46వ ర్యాంకు సాధించి కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. సందీప్ తండ్రి జనార్దన్, తల్లి సరస్వతి గ్రామంలోనే వ్యవసాయ పనులను చేస్తుంటారు. సందీప్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి.. పరీక్షల్లో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరాడు. అక్కడ చదువు పూర్తి చేసిన సందీప్ టీసీఎస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే.. ఎస్‌ఎస్‌సీ సీజీఎల్ పరీక్షను రాసి ప్రతిభ కనబర్చాడు. గ్రామ పెద్దలు సందీప్‌ను అభినందించారు.

నేడు శ్రవణ కీర్తన మహోత్సవం

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలోని సురంగి రాజావారి మైదానంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రవణకీర్తన మహోత్సవం జరుగునుంది. ఈ విషయాన్ని విశ్వహిందూపరిషత్ ప్రతినిధి పాక దాసు సోమవారం తెలిపారు. హరేరామ హరేకృష్ణ ఆలాపన చేస్తూ నగర సంకీర్తన, ప్రవచనం, నాటక ప్రదర్శన, మహాఅన్నప్రసాద వితరణ ఉంటుందని.. భక్తులు హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు లాప్‌ట్యాప్ అందజేత

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు గ్రామస్తులు సహకరించడం అభినందనీయమని బారువ బత్తులవీధి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రట్టి అప్పారావు అన్నారు. పాఠశాల అవసరాల కోసం ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు సమకూర్చిన లాప్‌ట్యాప్‌ను సోమవారం అందజేశారు.

ప్రజా వేదిక రేపు

పలాస: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వసంతకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామాల్లో జరిగిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీలు గ్రామస్థాయిలో నిర్వహించారని, వాటిపై ప్రజావేదిక జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

పది పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతం
- పలువురు విద్యార్థులు గైర్హాజర్



టెక్కలి బాలికోన్నత పాఠశాల కేంద్రానికి ఉదయం 8.30 గంటలకే చేరుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



టెక్కలి ప్రభుత్వ పాఠశాలలో స్క్రైబ్ సాయంతో పరీక్ష రాస్తున్న దివ్యాంగు విద్యార్థిని



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పరీక్ష కేంద్రంలో అంధ విద్యార్థిని చీకటి లావణ్యకు స్క్రైబ్‌గా వ్యవహరిస్తున్న గాయత్రి

టెక్కలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అయితే పలువురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. టెక్కలి మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ఎంజేపీ ఏపీ, ఆర్‌సీఎం, ఐఎఫ్‌జేఎస్, తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ కేంద్రాలకు మొత్తం 968 మంది విద్యార్థులను కేటాయించగా ఆరుగురు గైర్హాజరయ్యారు. కోటబొమ్మాళి మండలంలోని ఐదు కేంద్రాల్లో 854 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇదిలా ఉండగా మరో వైపు ఓపెన్ పదో తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచే ప్రారంభమయ్యాయి. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏపీసీ శశిభూషణరావు, ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు తదితరులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి, నౌపడ, దండుగోపాలపురం, బోరుభద్ర కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. సంతబొమ్మాల్లో 170, నౌపడలో 117, దండుగోపాలపురంలో 156, బోరుభద్రలో 236 మంది విద్యార్థులు పరీక్షలను రాశారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో ఏడు కేంద్రాల్లో 1482 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1473 మంది రాశారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు ఐదుగురు, రెగ్యులర్ విద్యార్థులు నలుగురు గైర్హాజరయ్యారని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథంలు తెలిపారు. ఈదుపురం పరీక్ష కేంద్రానికి సుదూర ప్రాంతం నుంచి విద్యార్థులు రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో అధిక మొత్తంలో ఆటోలకు చెల్లించి హాజరయ్యారు. డొంకూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చీకటి లావణ్య రేచీకటి, చెవిటితో బాధపడుతుండటంతో ఆమెకు సహాయంగా అదే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని దున్న గాయత్రి పరీక్ష రాశారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో 847 మందిపరీక్షలు రాయవలసి ఉండగా వారిలో ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈవోలు తెలిపారు.

కంచిలి: మండలంలోని నాలుగు కేంద్రాల్లో 699 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరయ్యారు.

సోంపేట: మండలంలోని ఐదు కేంద్రాల్లో 1134 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఐదు కేంద్రాల్లో 926 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 920 మంది హాజరవ్వగా.. ఆరుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో వెంకటరమణరావు తెలిపారు.

కవిటి: మండలంలోని ఐదు కేంద్రాల్లో 1018 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో ధనుంజయమజ్జి తెలిపారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1554 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1538 మంది హజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారని పలాస మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కేంద్రం వద్ద విద్యార్థులు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి కేంద్రానికి పరీక్షలు రాసేందుకు వెళుతున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద రూమ్‌నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పంచాయతీ కార్యాలయంలో దుర్గంధం..



టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణతో పాటు ఎదురుగా బస్టాండ్ పరిసరాల్లో సోమవారం విపరీతమైన దుర్గంధం చోటు చేసుకుంది. పంచాయతీ పరిధిలో రోజువారీగా చెత్తను సేకరించే ట్రాక్టర్లను పరిశుభ్రం చేయకుండా కార్యాలయం ఆవరణలో వదిలేశారు. దీంతో ఆయా వాహనాల నుంచి భరించలేనంతగా దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. చెత్తను సేకరించే వాహనాలను పరిశుభ్రం చేయకపోవడంపై విమర్శలు చేశారు.

–టెక్కలి

ఉపాధి పనులు ప్రారంభం



సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ అరంగి వసంతరావు పనులను ప్రారంభించారు. కొలతల ప్రకారం పని చేసి గరిష్ట వేతనం వచ్చేలా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. పని ప్రదేశంలో వసతులు కల్పించాలని ఉపాధి సిబ్బందిని కోరారు. స్థానిక నాయకుడు బెండి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

ఆస్పత్రి గేటు మూసేశారు!



టెక్కలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గేటును మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల క్రితం వాస్తు పేరుతో ఆస్పత్రికి మరో వైపు కొత్తగా గేటు మార్గాన్ని తెరిచారు. అయితే రెండు వైపులా మార్గాలను వినియోగిస్తున్నప్పటికీ తాజాగా పాత మార్గాన్ని మూసివేశారు. దీంతో కొంత మంది రోగులు పాత గేటు మార్గం వైపు వెళుతూ..అది మూసేసి ఉండడంతో వెనుదిరుగుతున్నారు. రెండు మార్గాలు తెరిచి ఉంచడం వలన ఏం నష్టమని రోగులు ప్రశ్నిస్తున్నారు.

–టెక్కలి

సేంద్రీయ కూరగాయల విక్రయం



సేంద్రీయ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలు వాడకంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ విధానం కంచిలి మండల యాంకర్ టి.శివానందం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద ప్రజలతో మాట్లాడారు. సేంద్రీయ విధానంలో సాగు చేసిన కూరగాయలు, ఆహార ధాన్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులు కూడా సేంద్రియ విధానంలో పంటలను సాగు చేయాలన్నారు.

–కంచిలి

ఉపాధి పనులు కల్పించాలని వినతి



ఉపాధి పనులు కల్పించాలని ఆర్డీవో కృష్ణమూర్తికి విన్నవిస్తున్న పెద్దసాన గ్రామస్తులు

టెక్కలి: గ్రామంలో ఉపాధి పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని...తమకు పనులు కల్పించాలని పెద్దసాన గ్రామానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి విన్నవించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పనుల కోసం ఆర్డీవోకు విన్నవించారు. అలాగే గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య తగాదాను పరిష్కరించాలని కోరారు. తనను కుటుంబ సభ్యులు సక్రమంగా చూడడం లేదని సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన సిమ్మ చిన్నమ్మి ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతం ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే విధంగా ఏర్పాటు చేసిన మాంసం దుకాణంపై చర్యలు తీసుకోవాలని ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన బి.హరి ఫిర్యాదు చేశారు. టెక్కలిలోని జగనన్న కాలనీలో తనకు ఇచ్చిన ఇంటి పట్టాను ఆక్రమించారని పట్టణానికి చెందిన ఒరిసి సునీత ఫిర్యాదు చేశారు.

మాజీ మంత్రి పరామర్శ



పరామర్శలో మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: టెక్కలిపట్నం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోరాడ కృష్ణమూర్తి ఇటీవల చనిపోయారు. దీంతో అతని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం సాయంత్రం పరామర్శించి సంతాపం తెలియజేశారు. కృష్ణమూర్తి టెక్కలిపట్నం పంచాయతీకి మూడుసార్లు సర్పంచ్‌గా పని చేసి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని అప్పలరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి, అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, బత్తిన హేమేశ్వరరావు, దంతం వైకుంఠరావు ఉన్నారు.

కళింగ కోమటి సంఘ కార్యవర్గం ఎన్నిక

టెక్కలి: టెక్కలి మండలం కళింగ కోమటి సంఘం ఎన్నికలను నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. పట్టణ అధ్యక్షునిగా లాడి శ్రీనివాస్, సెక్రటరీగా డి.వేణు గోపాల్, జాయింట్ సెక్రటరీలుగా జె.అనిల్, బి.హర్షవర్ధన్, కోశాధికారిగా ఎం.గోవిందరావు, ఉపాధ్యక్షునిగా బి.అశోక్ నియమితులయ్యారు. అలాగే మండల అధ్యక్షునిగా జామి రమణయ్య, సెక్రటరీగా డి.గోవిందరావు, ఉపాధ్యక్షునిగా బి.శ్రీను, కోరాడ తిరుమలరావు, కోశాధికారిగా టి.శంకర్, జాయింట్ సెక్రటరీగా బి.సాయి, కె.నాగరాజును ఎన్నుకున్నారు. సంఘం పెద్దలు టి.బాబ్జి, బి.నర్సింహమూర్తి, జె.నర్సింహమూర్తి, టి.బి.జీ.గుప్తా, టి.విష్ణుమూర్తి, టి.నారాయణమూర్తి, డి.మల్లేశ్వరరావు, టి.ఎరుకులనందన, టి.నాగరాజు తదితరులు ఎన్నికల నిర్వాహణ బాధ్యతలు చేపట్టారు.

టెన్త్ విద్యార్థి అదృశ్యం.. ఆచూకీ లభ్యం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి జగనన్న కాలనీలో నివాసముంటున్న సంపతిరావు విక్రాంత్ అనే టెన్త్ విద్యార్థి కనిపించడం లేదని విద్యార్థి తండ్రి రమేష్ సోమవారం కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాలుడు సోమవారం సాయంత్రం విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉండడంతో ఇంట్లో ఉండి చదువుకోవాలని తల్లిదండ్రులు పిల్లాడిని మందలించారు. దీంతో ఆ బాలుడు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అంతా గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న సమయంలోనే ఆ విద్యార్థి విశాఖ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో స్థానికులు గుర్తించి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు విశాఖపట్నం బయలుదేరినట్లు తెలిపారు.